

బొల్లారం పారిశ్రామికవాడలో పీసీబీ అధికారుల తనిఖీలు

జిన్నారం, ఏప్రిల్ 10: బొల్లారంలోని పారిశ్రామికవాడలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇటీవల పలు పరిశ్రమలు గ్రానైట్ వ్యర్థాల పారవేత, ఆయా పరిశ్రమల నుంచి పౌడర్ తదితర వాయు కాలుష్యం విడుదలపై ఫిర్యాదులు రాగా బుధవారం పీసీబీ ఏఈ అజయ్, సిబ్బంది పారిశ్రామికవాడలో వ్యర్థాలు పారవేస్తున్న పరిశ్రమలను తనిఖీ చేశారు.

సదాశివపేటలో జగ్గారెడ్డి ఇఫ్తార్ విందు

సదాశివపేట ఏప్రిల్ 10: సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి సదాశివపేటలో ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఇచ్చారు. ఈ విందులో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి తమ కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. ప్రతీఏటా తాను ఇఫ్తార్ విందు ఇవ్వడం ఆనవాయితీ అని, అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నానన్నారు. ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రిజర్వేషన్లను కల్పిస్తామన్నారు. రంజాన్ పవిత్రమాసం ముస్లింలలో ఆధ్యాత్మికత, పరోపకారాన్ని పెంపొందిస్తుందని జగ్గారెడ్డి అన్నారు.





సదాశివపేటలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి ఖర్జూరపండు తినిపిస్తున్న ముస్లిం, ఇఫ్తార్ విందులో జగ్గారెడ్డితో చిన్నారుల కరచాలనం



విద్యుత్‌దీపాల వెలుగులో సిద్దిపేటలోని మసీదు

ఈద్ ముబారక్

- నేడు రంజాన్ పర్వదినం
- ఈద్గాల వద్ద ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు


సిద్దిపేటఅర్బన్, ఏప్రిల్ 10 : పవిత్ర రంజాన్‌మాసం ముగింపు సందర్భంగా నేడు సిద్దిపేట జిల్లావ్యాప్తంగా రంజాన్ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకోనున్నారు. నెలరోజుల పాటు ఉపవాసదీక్షలుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు బుధవారం రాత్రి నెలవంక కనిపించడంతో గురువారం రంజాన్ జరుపుకోనున్నారు. ఉదయం లేచి ప్రార్థన ముగించుకుని తొమ్మిది గంటలకు ఖర్జూర పండు, షీర్‌కుర్మాతో ఒక్కపొద్దు విడిచి ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. తదుపరి భోజన కార్యక్రమంలో పాల్గొంటారు.

ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

ఈద్ సందర్భంగా సిద్దిపేటలోని మసీదులను లైట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈద్గా వద్ద పెద్ద ఎత్తున ముస్లింలు ప్రార్థనలో పాల్గొననుండడంతో ఎవరికీ ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఎండ వేడిమి తట్టుకునేలా చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఏర్పాట్లను స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం మతపెద్దలు పర్యవేక్షించారు. రంజాన్‌మాసాన్ని పురస్కరించుకుని పేద ముస్లింలకు కొంతమంది ముస్లిం పెద్దలు ఉచితంగా బిర్యానీ పొట్లాలను పంపిణీ చేశారు.



సిద్దిపేటలో కనిపించిన నెలవంక



సిద్దిపేటలో ముస్తాబైన మసీదు



ఈద్గా మైదానంలో ప్రత్యేక ఏర్పాట్లు

వేసవిలో అగ్గిముప్పు

- రోజురోజుకూ పెరుగుతున్న అగ్నిప్రమాదాలు
- మూడునెలల్లో 64 ఘటనలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న ఫైర్ అధికారులు



సిద్దిపేటలోని సబ్‌స్టేషన్‌లో మంటలను ఆర్పుతున్న ఫైరింజన్ (ఫైల్)

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 10 : జిల్లాలో అగ్ని ప్రమాదాలు రోజు రోజుకు అధికమవుతున్నాయి. ఈసారి ఏప్రిల్‌లో జిల్లాలో 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదవుతున్నది. ఈ తరుణంలో ఏ చిన్న నిర్లక్ష్యం చేసినా భారీ అగ్ని ప్రమాదానికి దారి తీసే అవకాశాలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ సంబంధిత అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలున్నాయి. పాఠశాలలు, ఆసుపత్రులు, షాపింగ్‌మాల్స్‌లలో ఏసీలు ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు పూర్తైన తర్వాత పంట చేన్లలో నిప్పు పెట్టడం వల్ల గాలికి నిప్పురవ్వలు ఎగిరి చుట్టుపక్కల ఉన్న గడ్డివాములపై పడి మంటలు చెలరేగే అవకాశం ఉంటుంది.

64 అగ్నిప్రమాదాల్లో..

ఈ సంవత్సరం జనవరి నుంచి మార్చి 31 వరకు సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ అగ్నిమాపక కేంద్రాల పరిధిలో 64 అగ్నిప్రమాదాలు జరిగాయి. సిద్దిపేట ఫైర్‌స్టేషన్ పరిధిలో 28 అగ్ని ప్రమాదాలు జరగ్గా రూ.3.70కోట్ల ఆస్తి నష్టం వాటిల్లింది. రూ.26,35,35000 విలువైన ఆస్తిని కాపాడారు. గజ్వేల్ ఫైర్‌స్టేషన్ పరిధిలో 11 అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. రూ.1.70లక్షల ఆస్తి నష్టం జరిగింది. రూ.76లక్షల ఆస్తిని కాపాడారు. దుబ్బాక ఫైర్‌స్టేషన్ పరిధిలో 15 అగ్నిప్రమాదాలు జరగగా రూ.13.45లక్షల ఆస్తి నష్టం జరిగింది. రూ.1.25కోట్ల ఆస్తిని కాపాడారు. హుస్నాబాద్ ఫైర్ స్టేషన్ పరిధిలో 8 అగ్ని ప్రమాదాలు జరగ్గా రూ.4.65లక్షల ఆస్తి నష్టం జరిగింది. దాదాపు రూ.33లక్షల విలువైన ఆస్తిని కాపాడారు. జిల్లా మొత్తంలో నాలుగు ఫైర్‌స్టేషన్ల పరిధిలో 64 అగ్నిప్రమాదాలు జరగగా రూ.3.89కోట్ల ఆస్తి నష్టం జరిగింది. రూ.28.70కోట్ల విలువైన ఆస్తి అగ్ని ప్రమాదాల నుంచి కాపాడారు.



పాతబస్టాండ్ సమీపంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిన వస్తువులు (ఫైల్)



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనలు

ఈ సంవత్సరం ఫిబ్రవరి 21న సిద్దిపేటలోని ముస్తాబాద్ చౌరస్తాలో ఉన్న సబ్‌స్టేషన్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. సిద్దిపేట ఫైర్‌స్టేషన్‌తో పాటు హుస్నాబాద్, దుబ్బాక గజ్వేల్ నుంచి ఫైర్ ఇంజన్లను పిలిపించి 18 గంటలు శ్రమించి మంటలను అదుపు చేశారు. జనవరిలో సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద గల ఓ టిఫిన్ సెంటర్ లో వంట గదిలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. ఫిబ్రవరిలో బ్లాక్ ఆఫీస్ చౌరస్తాలో ఐరన్ డిపోలో అగ్నిప్రమాదం జరిగింది. బుధవారం సిద్దిపేటలోని మెదక్‌రోడ్డులో కట్టెల మిషన్ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు 2.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. కోహెడ మండలంలో పంటచేనుకు నిప్పు అంటించడంతో మంటలు చెలరేగి పక్కన ఉన్న మొక్కజొన్న పంటకు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. హుస్నాబాద్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.50వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు బాగా పెరగడం వల్ల అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో కోతలు పూర్తయ్యాక చేనుకు నిప్పుటించకూడదు. నిర్లక్ష్యంగా సిగరెట్, బీడీలు తాగి ఆర్పివేయకుండా పారవేయకూడదు. నివాసాల్లో, దుకాణాల్లో నకిలీ వైర్లను వాడడం వల్ల షార్ట్‌సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది. పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం.

- రాజ్‌కుమార్,
సిద్దిపేట అగ్నిమాపక కేంద్ర అధికారి

అగ్నిప్రమాద నివారణ చర్యలు

1. చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకూడదు.
2. కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పేయకుండా అజాగ్రత్తగా పారేయకూడదు.
3. ఇంట్లోని వస్తువులను సక్రమంగా సర్దుకోవాలి. ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
4. ఐఎస్ఐ మార్కు ఎలక్ట్రికల్ వైర్లను మాత్రమే వాడాలి
5. పాడైనా వైర్లను వాడొద్దు. ఓవర్ లోడ్ వేయకూడదు. ఎలక్ట్రికల్ సాకెట్‌లో దానికి కెపాసిటీకి తగ్గిన ప్లగ్‌ను మాత్రమే వాడాలి.
6. పక్క మీద పడుకుని పొగతాగకూడదు
7. ఇంటి నుంచి ఎక్కువ రోజులు బయటకు వెళ్తున్నపుడు ఎలక్ట్రికల్ మెయిన్‌స్విచ్ ఆపేయాలి.
8. టపాకాయలు కాలుస్తునపుడు నైలాన్, పాలిస్టర్ దుస్తులు ధరించకూడదు.
9. ప్రమాదశాత్తు ఇంట్లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఆర్పడానికి ఎల్లవేళలా నీటిని నిల్వ ఉంచుకోవాలి.

వంట గదిలో

1. వంటింట్లో నాలుగు వైపులా వెలుతురు వచ్చేవిధంగా ఏర్పాటు చేసుకోవాలి
2. చిన్నపిల్లలను వంటింట్లో అజాగ్రత్తగా వదలకూడదు
3. ఐఎస్ఐ మార్కు ఉన్న గ్యాస్‌పైప్‌ను మాత్రమే వాడాలి.
4. వంట పూర్తయిన తర్వాత రెగ్యులేటర్‌ను ఆపేయాలి.
5. గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే రెగ్యులేటర్‌ను ఆపేయాలి.
6. వంటగదిలో కిరోసిన్, పెట్రోల్, అదనపు సిలిండర్‌ను ఉంచకూడదు.

ఇతర జాగ్రత్తలు

1. దుస్తులకు నిప్పు అంటుకున్నట్లైతే పరిగెత్తకూడదు. నేలపై పడుకుని దొర్లాలి. లేదా ఏదైనా దుప్పటిని చుట్టాలి.
2. కాలిన శరీర భాగాల పైన చల్లని నీరు పోయకూడదు.
3. పొగతో నిండిన గదుల్లో మోచేతులు, మోకాళ్లతో పాకాలి. ముక్కుకు, నోటికి తడివస్త్రాన్ని కట్టుకుని గాలి పీల్చడం వల్ల పొగలోపలికి వెళ్లకుండా ఆపవచ్చు.

ఆసుపత్రులు, పాఠశాలలు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో..

1. ఆసుపత్రులు, పాఠశాలలు, షాపింగ్ కాంప్లెక్సుల్లో ఆర్‌సీసీ లేదా కాంక్రీట్ శ్లాబులను మాత్రమే పైకప్పుగా వాడాలి.
2. ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాలలో మాత్రమే వాడాలి
3. సెల్లార్లలో ఆటోమేటిక్ స్ప్రింగ్లర్‌లను ఉపయోగించాలి
4. ఆసుపత్రులు, పాఠశాలల్లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్షేమంగా బయటపడేందుకు ఒక ప్రణాళికను రచించి అందరూ పాటించేలా చూడాలి.

ఆగని రేషన్ బియ్యం అక్రమ రవాణా

- తాజాగా మూడు వాహనాల్లో 80 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

రాయపోల్, ఏప్రిల్ 10: టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు ప్రతిరోజూ ముమ్మర తనిఖీలు చేస్తూ బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పట్టుకుంటున్నప్పటికీ అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. తాజాగా మంగళవారం సాయంత్రం మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు పట్టుకున్నారు. రాయపోల్ మండలంలోని వివిధ గ్రామాల్లో తక్కువ రేటుకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా వాహనాల్లో తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, రాయపోల్ పోలీసులు సంయుక్తంగా రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పట్టగూడెంకి చెందిన మాధావత్ నామ్ మినీ అశోక్ లీలాండ్ వాహనంలో 38 క్వింటాళ్లు, అదే గ్రామానికి చెందిన భూక్య రమేష్ వాహనంలో 28 క్వింటాళ్లు, యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి గ్రామం నుంచి టాటా ఏసీ వాహనంలో నూనేవత్ బిచ్చు 14 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. బియ్యం, వాహనవాహనంతో పాటు రాయపోల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్టప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని రాయపోల్ ఎస్ఐ రఘుపతి హెచ్చరించారు.

'జల దోపిడీ'పై రెవెన్యూ అధికారుల చర్యలు

- కాజీపల్లి పారిశ్రామికవాడలో నీటి ట్యాంకర్లను అడ్డుకున్న సిబ్బంది

జిన్నారం, ఏప్రిల్ 10: ఈనెల 8న 'పారిశ్రామికవాడల్లో జల దోపిడీ' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు బుధవారం జిన్నారం మండలంలో దాడులు జరిపారు. ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది గడ్డపోతారం, కాజీపల్లి పారిశ్రామికవాడలకు నీటి సరఫరా చేస్తున్న ట్యాంకర్లను అడ్డుకొని వాహనాల టైర్ల నుంచి గాలి తీసివేశారు. అనంతరం నీటిని పంపింగ్ చేస్తున్న మోటార్లు, కార్యాలయాల వద్ద విద్యుత్ ఫ్యూజ్‌లు తొలగించి, రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. కాగా నీటిని అక్రమంగా తరలించే వారిపై కేసులు నమోదు చేస్తామని, ట్యాంకర్ల ద్వారా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.



గడ్డపోతారం శివారులో ఓ ట్యాంకర్ టైర్ల నుంచి గాలి తీసేస్తున్న ఆర్ఐ, సిబ్బంది

'బండి'కి ఓట్ల రాజకీయం తప్ప అభివృద్ధి చేతకాదు

- హామీలను విస్మరిస్తున్న కాంగ్రెస్
- కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

హుస్నాబాద్, ఏప్రిల్ 10 : ఎంపీ బండి సంజయ్‌కి ప్రజల మనోభావాలతో ఓట్ల రాజకీయం చేయడమే తప్ప అభివృద్ధి చేయడం చేతకాదని ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. బండి సంజయ్ ఐదేళ్లు ఎంపీగా ఉండి ఐదు రూపాయలు కూడా తీసుకురాలేదని వెల్లడించారు. బుధవాంం ఆయన మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌తో కలిసి హుస్నాబాద్‌లో మార్నింగ్ వాక్ చేస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉపాధిహామీ నిధులు, అంగన్‌వాడీ వంటి పథకాలకు నిధులు తెచ్చానని ఆయన చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. యూరియా, డీఏపీలకు నెహ్రూ కాలం నుంచి సబ్సిడీ ఇస్తున్నారని గుర్తుచేశారు. మోదీ మాత్రమే సబ్సిడీ ఇస్తున్నారనే మోసపూరిత మాటలను ప్రజలను సహించబోరన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందన్నారు. గ్యాస్ సిలిండర్‌కు ప్రజలు మొదట డబ్బు చెల్లించిన తరువాత వారి ఖాతాల్లో వేస్తామనడం కాంగ్రెస్ ఉచిత పథకాలను ఉద్దెర పథకాలుగా మార్చిందని ఎద్దేవా చేశారు. తాను ఎంపీగా ఉండి ఎన్నో అభివృద్ధి పనులు చేశానని వివరించారు. ఈ సారి బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, కారు గుర్తుకే ఓటు వేస్తామంటున్నారని తెలిపారు. ఎంపీగా గెలిపిస్తే రాష్ట్రం నుంచి పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతానని, హుస్నాబాద్‌లో నవోదయ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీ లక్ష్మీ, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, చిట్టి గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మున్సిపల్‌చైర్మన్ సుద్దాల చంద్రయ్య, కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, కొంకటి నళిని దేవి, గోవిందు రవి, వాల సుప్రజ, గూళ్ళ రాజు, జనగామ రత్న రవీందర్‌రావు, రమాదేవి, మాజీ ఎఎంసీ చైర్మెన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, బీలునాయక్, కొంకటి రవీందర్, ఇంద్రాల సారయ్య, సుధాకర్, అరుణ్‌కుమార్ తదితరులున్నారు.



హుస్నాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్

'మోడే' ఆధారం



దుబ్బాక పెద్దచెరువులో చేపలను వేటాడేందుకు వచ్చిన పక్షులు చెరువు మధ్యలోని మోడుబారిన చెట్టును ఆధారంగా చేసుకుని అన్ని ఒకచోట చేరాయి. - దుబ్బాక

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 10: మండల పరిధిలోని రాయవరం గ్రామంలో బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో సీఈవో రాములు వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని, దళారులకు ధాన్యాన్ని విక్రయించి రైతులు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సత్తిరెడ్డి, బాలరాజు మరియు మల్లేశం, రాజేష్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులను అభినందిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 10: సైబర్ అంబాసిడర్ బాధ్యతలు అప్పగించే కార్యక్రమం ద్వారా సిద్దిపేట అర్బన్ మండలం బక్రీ చెప్యాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైబర్‌నేరాలపై ఐదు రోజులపాటు అవగాహన కార్యక్రమాన్ని కల్పించినట్లు త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. బుధవారం సైబర్ క్రైం డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ అంబాసిడర్ ప్లాట్ ఫారం కోర్సులో అద్భుత ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులు ఎం. సంపూర్ణ, ఎం.లోకేష్, ఎం.స్నేహ, డి. చైతన్యకు ప్రశంసా పత్రాలు అందించారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తల్లిదండ్రులకు పూర్తిగా వివరించాలని సీఐ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.నాగేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అనీల్‌కుమార్, సుహాసిని, రమాదేవి, శ్రీశైలం, లక్ష్మయ్య, సునీత, ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పూజ, చంద్రకాంత్, రఘుపతి, కరుణాకర్, కళ్యాణ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అడ్‌హక్ కమిటీతో బార్ అసోసియేషన్‌కు సంబంధం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్

చేర్యాల, ఏప్రిల్ 10: కోర్టు ఏర్పాటు విషయమై ఇటీవల పలువురు న్యాయవాదులు ఏర్పాటుచేసుకున్న అడ్‌హక్ కమిటీతో బార్ అసోసియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదని చేర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూమిగారి మనోహర్ స్పష్టం చేశారు. బుధవారం చేర్యాలలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 28న బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయని, అందులో ఓడిన రమేశ్ జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. కోర్టు ఏర్పాటు కాకముందే తప్పుడు సంకేతాలకు దారి తీస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కోర్టు సాధనకు తాము అన్నివర్గాల సహకారాన్ని తప్పక తీసుకుంటామన్నారు. అడ్‌హక్ కమిటీ ఏర్పాటు విషయమై బార్ కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. సమావేశంలో కాటం సురేందర్, ప్రణీత్, ఉట్కూరి అమర్ ఉన్నారు.

మహిళలకు న్యాయం జరిగేలా చూడాలి

● న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు



సంగారెడ్డిలోని సఖి కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న హనుమంతరావు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 10: సఖి కేంద్రానికి వచ్చే మహిళలకు న్యాయం జరిగేలా చూడాలని న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. సంగారెడ్డిలోని సఖి కేంద్రం, బాలసదనంలో బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహహింస, బాల్య వివాహ, పోక్సో చట్టం, వరకట్న నిషేధ చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. వేసవి వచ్చినందున వడదెబ్బ తగలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి పలు సూచనలు చేయాలన్నారు. అనంతరం ఆయా కేంద్రాల్లో రికార్డులను తనిఖీ చేశారు. న్యాయాధికారి వెంట సఖి కార్యనిర్వహణ అధికారి రేణుక, కౌన్సిలర్ కల్పన, బాలసదనం ఇన్‌చార్జి విజయ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య చరిత్రలో 'హోమియోపతి' ప్రత్యామ్నాయ వైద్యం

● హోమియోపతి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.నర్మదషిండే



సంగారెడ్డిలో సామ్యూల్ హానిమన్ జయంతిలో పాల్గొన్న హోమియోపతి డాక్టర్లు, సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10: వైద్య చరిత్రలో 'హోమియోపతి' ప్రత్యామ్నాయ వైద్యమని హోమియోపతి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.నర్మదషిండే పేర్కొన్నారు. ప్రపంచానికి హోమియో విధానాన్ని పరిచయం చేసిన డా.సామ్యూల్ హానిమన్ 269 జయంతి సందర్భంగా సంగారెడ్డి ఆయూష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లోని హోమియోపతి డిస్పెన్సరీలో బుధవారం సామ్యూల్ హానిమన్ చిత్రపటానికి డా.నర్మదషిండే పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది హోమియోపతి వైద్యం పొందుతూ ఆరోగ్యంగా జీవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.శ్యామ్ సుందర్‌ప్రసాద్, డా.సమీన, ఫార్మసిస్టులు ఎస్.రమేశ్, ఉమాదేవి, హేమలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బుజరాన్‌పల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో మత్తడిపోచమ్మ జాతర సందర్భంగా బండ్ల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం



కల్హేర్ మండల పరిధిలోని క్రిష్టాపూర్‌లో అఖండ హరినామ సప్తాహలో కరణ్ మహరాజ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

పెద్దశంకరంపేట్, ఏప్రిల్ 10: పెద్దశంకరంపేట మండల పరిధిలోని బుజరాన్‌పల్లిలో పద్మావతి సహిత లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం సాయంత్రం ఉత్సమూర్తులను పల్లకీసేవలో గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూరెమ్మవిఠల్, ఆలయ కమిటీ సభ్యులు జగన్నాథరావు, సుధాకర్‌రావు, అశోక్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ఊరేగింపు

వట్‌పల్లి, ఏప్రిల్ 10: మండల పరిధిలోని మేడుకుంద గ్రామంలో నిర్మించిన బీరప్పస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు డోలు వాయిద్యాలు, ఒగ్గు కళాకారుల నృత్యాల నడుమ ఊరేగింపు ఆలయం వద్దకు సాగింది. ఉత్సవాలకు హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా దుర్గామాత జాతర

కల్హేర్/సిర్గాపూర్, ఏప్రిల్ 10: సిర్గాపూర్ మండల పరిధిలోని పోచాపూర్‌లో ఉగాది పండుగ సందర్భంగా దుర్గామాత ఆలయజాఆతర బుధవారం నిర్వహించారు. ఉదయం రథోత్సవంలో భాగంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథాన్ని ఊరేగించారు. అనంతరం కుస్తీపోటీలు నిర్వహించగా.. పేరు మోసిన పహిల్వాన్‌లు పాల్గొనడంతో పోటీలు రసవత్తరంగా జరిగాయి. విజేతలైన మల్లయోధులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో తెలంగాణ ప్రాంతం వారే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు మండలాధ్యక్షుడు క్రిష్ణమూర్తి, మాజీ సర్పంచ్ రాములు, నాయకులు లక్ష్మయ్య, పండరి, సాయిలు పాల్గొన్నారు.



సిర్గాపూర్ మండలం పోచాపూర్‌లో నిర్వహించిన కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

ముగిసిన అఖండ హరినామ సప్తాహ

మండల పరిధిలోని క్రిష్టాపూర్‌లో ఏడురోజుల పాటు నిర్వహించిన అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం బుధవారం ముగిసింది. అంతర్గాం గజేంద్ర ఆశ్రమ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహరాజ్, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కరణ్ మహరాజ్ మాట్లాడుతూ మానవాళి జీవన విధానం భక్తితో ముడి పడి ఉన్నందున ఇలాంటి కార్యక్రమాలను ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, కరణ్ మహరాజ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచులు కిష్టారెడ్డి, బేతయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా బండ్ల ప్రదర్శన

నారాయణఖేడ్, ఏప్రిల్ 10: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట మత్తడి పోచమ్మ జాతరను పురస్కరించుకుని బుధవారం రెండోరోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాతతో పాటు మత్తడి పోచమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకం, అలంకరణతోపాటు భక్తులు ఓడిబియ్యం, కండజ్యోతి సమర్పణలు విశేషంగా చేపట్టారు. సాయంత్రం బండ్ల ప్రదర్శనను అట్టహాసంగా నిర్వహించారు.

పలు గ్రామాల్లో పాచిబండ్ల ప్రదర్శన, రథోత్సవం

కొల్చారం, ఏప్రిల్ 10: ఉగాదిని పురస్కరించుకుని కొల్చారం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గ్రామ దేవతలకు పాచిబండ్ల ప్రదర్శన నిర్వహించారు. కొల్చారంలోని ఎల్లమ్మ, నల్లపోచమ్మ, లక్ష్మమ్మ, పెద్దమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు డప్పుచప్పుళ్ల మధ్య పాచిబండ్లను ప్రదర్శించారు.



కొల్చారం మండలం వెంకటాపూర్‌లో వేంకటేశ్వరస్వామికి రథోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

వెంకటాపూర్‌లో వేంకటేశ్వరస్వామికి బుధవారం రథోత్సవం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ మహ్మద్‌గౌస్ చర్యలు తీసుకున్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

మెదక్, ఏప్రిల్ 10: చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామంలోని ఊడలమర్రి నల్లమ్మపోచమ్మ జాతరలో భాగంగా రెండోరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల మధ్య బోనాల ఊరేగింపు వైభవంగా సాగింది.

కంగ్టిలో శోభాయాత్ర

కంగ్టి, ఏప్రిల్ 10: మండల పరిధిలోని రాసోల్‌లో నిర్మించిన రామాలయంలో ప్రాణ ప్రతిష్ఠ చేయనున్న సీతారామచంద్రుల విగ్రహాలకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, నృత్యాలు చేస్తూ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఊరేగిస్తూ శోభాయాత్ర చేపడుతూ చాప్టా మీదుగా రాసోల్‌కు వెళ్లారు. కాగా ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో 11 నుంచి రాసోల్‌లో సప్తాహం కొనసాగనున్నది.

ఎట్టకేలకు కాంగ్రెస్‌లోకి మదన్‌రెడ్డి?

● ముహూర్తం ఖరారు చేసుకున్న మాజీ ఎమ్మెల్యే
● పెద్దఎత్తున అనుచరవర్గంతో చేరేందుకు సన్నాహాలు
● సీఎం రాజకీయ సలహాదారుడు నరేందర్‌రెడ్డితో చర్చలు



మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 10: నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ కీలక నేతగా ఉన్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఎట్టకేలకు కాంగ్రెస్‌లో పెద్దఎత్తున తన అనుచర వర్గంతో చేరేందుకు ముహూర్తం ఖరారైంది. 15 రోజుల క్రితం స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరే దానిపై చర్చించిన విషయం విదితమే. అయితే సీఎంను కలిసిన ఒకటి రెండురోజుల్లోనే తన అనుచర వర్గంతో పార్టీలో కలవాలని నిర్ణయించుకున్నా వివిధ కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. చివరకు బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకులు సుహాసినిరెడ్డి, శేషసాయిరెడ్డిలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయల సలహాదారుడు నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి పార్టీలో ఏ రోజు చేరాలనే విషయమై చర్చించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఈ నెల 15వ తేదీలోపు ఏదో ఒకరోజు సీఎంతో పాటు పార్టీ ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. దీంతో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక అంశం ఎట్టకేలకు ఖరారైంది. ఇప్పటికే మదన్‌రెడ్డి తన అనుచరవర్గాన్ని తన వెంట రావాలని ఫోన్‌ద్వారా ఆహ్వానిస్తున్నారు. అన్నివిధాలా తాను మీకు అండగా ఉంటానని మదన్‌రెడ్డి భరోసా ఇస్తూ.. తనవెంట తీసుకెళ్లడానికి తీవ్రంగా యత్నిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునితారెడ్డి సైతం బీఆర్‌ఎస్ నుంచి నాయకులు వీడకుండా తనదైన శైలిలో వారిని కట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అదేవిధంగా మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా నియోజకవర్గంలో పార్టీ ముఖ్యనాయకులు పార్టీ వీడకుండా స్వయంగా కొందరికి ఫోన్ కూడా చేస్తున్నట్లు సమాచారం. దీంతో ముఖ్యనేతల మధ్య ఎటు నిర్ణయం తీసుకోవాలో తెలియక అయోమయంలో కొందరు ఉండగా... మరికొందరు మదన్‌రెడ్డి వెంట వెళ్లడానికి నిర్ణయించుకున్నారు. ఇంకొందరు ఎంపీ ఎన్నికలయ్యే వరకు వేచి చూద్దామనే ధోరణిలో ఉన్నట్లు తెలిసింది. మొదటి నుంచి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నవారు బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతామని అంటున్నారు. మరీ మదన్‌రెడ్డి వెంట వెళ్లేవారు ఎందరో.. పార్టీలో ఉండేవారు ఎందరో ఒకటి రెండురోజుల్లో తేలనున్నది. ఏదిఏమైనా మదన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడటం ఆ పార్టీకి నర్సాపూర్‌లో పెద్ద నష్టమే అని చెప్పవచ్చు. నియోజకవర్గంలో తనకంటూ ప్రత్యేక అనుచర గణం ఉండడంతో పాటు పెద్ద సంఖ్యలో ఓటర్లను ప్రభావితం చేయగల నాయకత్వ లక్షణాలు ఉన్న వ్యక్తి మదన్‌రెడ్డి. అంతేకాకుండా మాజీ సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడనే పేరు రాష్ట్రస్థాయిలో ఉండటం వల్ల బీఆర్‌ఎస్ రాష్ట్ర నేతలు కూడా మదన్‌రెడ్డి పార్టీ వీడటం పట్ల కొంత ఇబ్బందికరంగానే ఫీలవుతున్నారని చెప్పవచ్చు.

ఇఫ్తార్ విందులో మంత్రి దామోదర్ రాజనర్సింహ



ఇఫ్తార్ విందులో పాల్గొన్న దామోదర్

వట్‌పల్లి, ఏప్రిల్ 10: మండల కేంద్రమైన వట్‌పల్లిలో బుధవారం రాత్రి ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఖాజా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌గౌడ్, మండలాధ్యక్షుడు రమేష్ జ్యోషి, నాయకులు విశ్వాస్, రమేష్, దిగంబరావ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో గర్భిణి మృతి

● అత్తింటివారే కొట్టి చంపారని మృతురాలి బంధువుల ఆరోపణ



నాగలత(ఫైల్)

అక్కన్నపేట, ఏప్రిల్ 10: అనుమానాస్పద స్థితిలో గర్భిణి బుధవారం మృతిచెందింది. అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన ఎలవేని అశోక్‌కు హన్మకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన నాగలత(29)తో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల కుమారుడు ఉండగా.. ప్రస్తుతం నాగలత 8 నెలల గర్భిణి. కాగా నాగలత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నదని ఆమె కుటుంబసభ్యులకు సమాచారమందించారు. అత్తింటి వారే కొట్టి చంపారని మృతురాలి బంధువులు ఆరోపించారు. భర్త, అత్త మామ, మరిది కలిసి నాగలతను కొట్టి చంపి ఉరి వేశారని మృతురాలి తండ్రి నగిరబోయిన రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని సెల్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

● 2 గంటల పాటు హైడ్రామా



సెల్ టవర్ ఎక్కిన లక్ష్మయ్య

కంది, ఏప్రిల్ 10: తన సమస్యలు పరిష్కరించాలంటూ మద్యం మత్తులో ఓ వ్యక్తి బుధవారం కంది తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని బీఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. మధ్యాహ్నం 1.30 నుంచి 3.30 వరకు దాదాపు రెండు గంటలపాటు సెల్ టవర్‌పై ఫీట్లు చేస్తూ, వేలాడుతూ అందరినీ భయభ్రాంతులకు గురిచేశాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న సంగారెడ్డి రూరల్ పోలీసులు ముందు జాగ్రత్త కోసం ఫైర్ ఇంజన్‌ను తెప్పించారు. సదరు వ్యక్తిని కిందకు రప్పించడానికి ఎస్‌ఐ వినయ్‌కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి అతని సమస్యలు తీరుస్తామని హామీఇవ్వడంతో కిందకు దిగాడు. కంది మండలం కాశీపూర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్యకు 40 ఏళ్ల కిందట ఇచ్చిన ఇంటి పట్టా సర్టిఫికెట్ ఎలుకలు కొట్టాయని, తనకు మరో సర్టిఫికెట్ కావాలని, అలాగే కొత్త రేషన్ కార్డు ఇప్పించాలని కొన్ని రోజుల క్రితం రెవెన్యూ అధికారులను కోరాడు. అధికారులు సర్టిఫికెట్ కావాలంటే అతని ఇంటి పక్కనున్న మరొకరి సర్టిఫికెట్ ఏదైనా ఉంటే తీసుకునిరమ్మన్నారు. అధికారులు చెప్పింది వినకుండా సెల్ టవర్ ఎక్కాడు. ఎస్‌ఐ, తహసీల్దార్ లక్ష్మయ్య త్వరలోనే సమస్య తీరుస్తామని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. సెల్‌టవర్ ఎక్కకుండా చుట్టూ రక్షణ కవచం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి



సందీప్‌రెడ్డి(ఫైల్)

బెజ్జంకి, ఏప్రిల్ 10: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతిచెందిన సంఘటన మండలంలోని బేగంపేటగూడెం గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెజ్జంకి మండలం గూడెం గ్రామానికి చెందిన హనుమండ్ల సందీప్‌రెడ్డి(29) వడ్లూరు గ్రామానికి చెందిన తన స్నేహితుడి రాజుతో కలిసి కారులో మండలంలోని లక్ష్మీపూర్ గ్రామం నుంచి గూడెం గ్రామానికి వెళ్తున్నాడు. బేగంపేట గ్రామ శివారులో వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో సందీప్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, రాజుకు గాయాలయ్యాయి. గాయపడిన రాజును కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి రామచంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో బైక్ వెళ్తున్న యువకుడి మృతి



మృతిచెందిన సంపత్‌కుమార్

జీడిమెట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. సంగారెడ్డి జిల్లా, కంగ్టి మండలం సిద్దంగిరి గ్రామానికి చెందిన రత్నప్ప కుమారుడు ఎం.సంపత్‌కుమార్(35) బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి సూరారం కాలనీ ప్రాంతలోని సాయిబాబానగర్ మొండి నర్సింహబస్తీలో నివాసముంటున్నాడు. స్థానికంగా వెల్డర్‌గా పనిచేస్తున్న సంపత్‌కుమార్ బుధవారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో బైరాజ్‌ఇస్పాత్ ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టడంతో సంపత్‌కుమార్ కిందపడ్డాడు. లారీ ముందు చక్రాలు తలపై పోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి



మృతిచెందిన గొర్రెపిల్లలను పరిశీలిస్తున్న గొర్రెల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి

మనూరు, ఏప్రిల్ 10: కుక్కల దాడిలో 60 గొర్రెపిల్లలు మృతిచెందిన సంఘటన మనూరు మండలం బెల్లాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన దత్తుగొండ, హన్మగొండ, బస్‌గొండ, శ్రీను, సుధాకర్, బసిగొండలకు చెందిన 60 గొర్రెపిల్లలపై కుక్కలు దాడి చేయడంతో మృతిచెందాయి. విషయం తెలుసుకున్న గొర్రెల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి బాధితులను పరామర్శించి మాట్లాడారు. గొర్రెల పెంపకందారులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

కాజీపల్లిలో అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ కట్టడాలు కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

జిన్నారం, ఏప్రిల్ 10: జిన్నారం మండలంలోని కాజీపల్లిలో ప్రభుత్వ భూమిలో నిర్మించిన పలు కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. బుధవారం కాజీపల్లి 181 సర్వే నెంబరులో అక్రమంగా నిర్మించిన గదులు, ప్రహరీ, బేస్‌మెంట్లను ఆర్‌ఐ జయప్రకాష్ నారాయణ సిబ్బందితో కలిసి ఎక్స్‌కవేటర్లతో కూల్చేయించారు.

మిరుదొడ్డి ఎంపీపీపై నాన్‌బెయిల్ వారెంట్ జారీ

మిరుదొడ్డి, ఏప్రిల్ 10: చెప్యాల గ్రామంలో మహిళను నిర్బంధించి, అసభ్యంగా ప్రవర్తించిన కేసులో మిరుదొడ్డి ఎంపీపీ సాయిలుపై నాన్‌బెయిల్ వారెంట్ జారీ అయ్యిందని ఎస్‌ఐ పరశురాం తెలిపారు. బుధవారం మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2020లో ఎంపీపీ సాయిలు ఓ మహిళను బెదిరించడంతోపాటు నిర్బంధించి అసభ్యకంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశామన్నారు. ఇదే విషయమై కోర్టుకు హాజరుకావాల్సిందిగా ఎంపీపీని కోరగా.. హాజరుకాకపోవడంతో కోర్టు ధిక్కరణ కింద నాన్ బెయిల్ వారెంట్‌ను జారీచేసిందని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ సాయిలు కోర్టులో హాజరైనట్టు సమాచారం.

శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రంలో జాతరకు వేలం పాటలు

బెజ్జంకి, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 30 వరకు జరగనున్న నేపథ్యంలో జాతరకు ఆలయ అధికారులు బుధవారం వేలం పాటలు నిర్వహించారు. కొబ్బరి కాయలు రూ. 2.08లక్షలు, లడ్డు, పులిహోరకు రూ. 4.08 లక్షలు, తైబజారు రూ. 10,500, దైవదర్శనం రూ.1.78 లక్షలు, దివిటీలు రూ. 21వేలు, ప్యాలాలు, పుట్నాలు రూ.1,100 చొప్పున పలువురు వేలం పాడి దక్కించుకున్నారు. కాగా వేలం పాటల ద్వారా మొత్తం రూ. 9,21,100 ఆలయానికి ఆదాయం వచ్చినట్లు ఈవో విశ్వనాథశర్మ తెలిపారు.

మద్దూరు టీఏ జగదేవ్‌పూర్‌కు బదిలీ

మద్దూరు, ఏప్రిల్ 10: నిబంధనలు అతిక్రమించి ఇటీవల బీఆర్ఎస్ సమావేశానికి హాజరైన ఈజీఎస్ ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ వేటు వేసిన విషయం తెలిసిందే. ఈజీఎస్‌లో పని చేస్తున్న వారిపై పెద్ద ఎత్తున వేటు పడటంతో ఆ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పనుల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వీరి స్థానంలో ఇతర మండలాల్లో కొనసాగుతున్న వారిని ఇన్‌చార్జీలుగా కొనసాగించేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే మండలంలోని ఈజీఎస్‌లో పని చేస్తున్న టీఏను జగదేవ్‌పూర్‌కు బదిలీ చేశారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 10: మండలంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి శివప్రసాద్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుకాణదారులు ప్రభుత్వం ఆమోదించిన మందులు మాత్రమే విక్రయించాలన్నారు. జిల్లాలోని ప్రతీ డీలర్ ఎరువులు, పురుగుమందులు, విత్తన చట్టాల నిబంధనల ప్రకారం దుకాణాలను నిర్వహించాలని, లేని పక్షంలో ఉపేక్షించేది లేదన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అందజేయాలని సూచించారు. యాసంగి వరి పైరు కోసిన తర్వాత రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి చేయాలన్నారు. లేదంటే దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం సబ్సిడీ ధరలకు జీలుగ జనుము విత్తనాలను అందిస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి వసంతరావు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్న రఘునందన్

దుబ్బాక, ఏప్రిల్10: అక్బర్‌పేట-భూంపల్లి మండలం బొప్పాపూర్ గ్రామంలో బుధవారం బీజేపీ మెదక్ పార్లమెంటు అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు తన తల్లితండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ నెల 18న తన పార్లమెంటు అభ్యర్థిత్వానికి నామినేషన్ వేయనున్న సందర్భంగా ముందుగా తల్లి భారతి, తండ్రి భగవంత్‌రావు పాదాలకు మొక్కి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం గ్రామంలోని సన్నిహితులను ప్రజలను కలిశారు. ఈ నెల 18న నామినేషన్ కార్యక్రమానికి బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందిన ఇద్దరు సీఎంలు హాజరుకానున్నట్టు సమాచారం.

నేడు బీఆర్ఎస్ మండలస్థాయి సమావేశాలు

చిన్నకోడూరు/కొండపాక/కుకునూరుపల్లి, ఏప్రిల్ 10 : చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులో గురువారం మండల స్థాయి పార్టీ శ్రేణుల సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. అలాగే కొండపాక మండలం దుద్దెడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మండల సమావేశాన్ని గురువారం 10 గంటలకు నిర్వహించనున్నట్టు మండల అధ్యక్షుడు నూనె కుమార్ తెలిపారు. కుకునూరుపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ మండల స్థాయి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్టు పార్టీవర్గాలు తెలిపాయి.

ప్రభుత్వ శాఖల సమన్వయలోపం.. ప్రజలకు శాపం

- జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో తరచూ ధ్వంసమవుతున్న భగీరథ పైప్‌లైన్
- వేసవిలో తాగునీటి వృథాపై చేర్యాలవాసుల ఆగ్రహం



ఇటీవల స్థానిక రైతుబజారు సమీపంలో ధ్వంసమైన భగీరథ పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న నీరు



లీకేజీ నీటి గుంతతో వాహనదారుల ఇబ్బందులు

చేర్యాల, ఏప్రిల్ 10: జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో ఎన్‌హెచ్, మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ముందస్తు ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడంతో పదే పదే మిషన్ భగీరథ పైపులు ధ్వంసమై తాగునీటి సరఫరాలో ఆటంకాలేర్పడుతున్నాయి. అయినప్పటికీ పనుల్లో నిర్లక్ష్యం వీడకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రోడ్డుపక్క నుంచి గతంలో భగీరథ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టగా, ప్రస్తుతం రోడ్డు విస్తరణ కోసం ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేస్తున్నారు. అయితే ఎక్కడ పైప్‌లైన్ ఎంత లోతులో ఉందన్న విషయాన్ని మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీసే సమయంలో పైపులు ధ్వంసమై నీరు ఎగజిమ్మి తాగునీటి సరఫరాకు ఆటంకాలేర్పడుతున్నాయి. దీంతో ఏర్పడిన మురికి గుంతల్లో తాగునీటి పైపులు ఉండటంతో నీరు కలుషితమవుతున్నాయి. బుధవారం స్థానిక రైతు బజారు ఆవరణలో రోడ్డుతవ్వకం చేపట్టగా, పైప్‌లైన్ ధ్వంసమై ఒక్కసారిగా నీరు ఎగజిమ్మాయి. పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో చుట్టు పక్కలవారు భయాందోళనకు గురై పరిగెత్తడంతో తృటిలో ప్రమాదం తప్పినట్టయ్యింది. ఎగజిమ్మిన నీరు వృథాగా ప్రవహించడంతో షాదీఖానా షాపింగ్ కాంప్లెక్స్ వరకు నీరు నిలిచాయి. తద్వారా వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. లీకేజీల మరమ్మతులను కూడా సక్రమంగా చేపట్టకపోవడంతో పలు చోట్ల సమీప ప్రదేశాలు చిత్తడిగా మారుతున్నాయి. అసలే వేసవికాలం.. తాగునీటి వృథాతో పాటు కలుషితం కావడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనులను పర్యవేక్షిస్తే పైప్‌లైన్ ధ్వంసం కాకుండా తాగునీటి ఎద్దడిని కొంతవరకైనా నివారించవచ్చని స్థానికులు చెబుతున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- మండల ప్రత్యేక అధికారి శివప్రసాద్

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 10: తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి, మండల ప్రత్యేక అధికారి శివప్రసాద్ సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ గ్రామాల్లో తాగునీటి సరఫరా, ఇతర సమస్యలపై ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. వర్షాలు పడే వరకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలియజేశారు. సమావేశంలో ఎంపీటీసీవో యాదగిరి, ఎంపీవో శ్రీనివాస్‌వర్మ, పీర్లపల్లి, ధర్మారం గ్రామాల ప్రత్యేక అధికారి వసంతరావు తదితరులున్నారు.

మెదక్ ఎంపీ స్థానం కాంగ్రెస్‌కే ఖాయం

ములుగు, ఏప్రిల్ 10: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ పార్లమెంటు స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని మండల పార్టీ అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ఎంతో కృషి చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించుకోవడం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గజ్వేల్ నియోజకవర్గంలో ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ భూ నిర్వాసితులు వెంకట్రామారెడ్డికి ఓటు ద్వారా తగిన బుద్ధి ఓటు ద్వారా చెప్తారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మోసపూరితమైన వాగ్దానాలతో ప్రజలను వంచిస్తున్నాయన్నారు. అలాంటి వ్యక్తులను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిగలకు తీవ్ర అన్యాయం



గజ్వేల్‌లో మహాధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 10: పార్లమెంటు అభ్యర్థుల సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంగ్రాతి కృష్ణ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు మైస రాములు, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురాములు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ మందకృష్ణ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ సీట్లలో తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలకు మూడు సీట్లు ఉంటే రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ద్రోహం చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి మాలల మాట వింటూ మాదిగలకు అన్యాయం చేస్తున్నాడన్నారు. మాదిగల మద్దతుతోనే తాను ఈ స్థాయికి ఎదిగిన అని వేదికల మీద మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాదిగలకు అవకాశాలను ఇవ్వకుండా అవమానపరుస్తూ నమ్మకద్రోహానికి పాల్పడ్డాడన్నారు. మాదిగలకు ద్రోహం చేసిన పార్టీలన్నింటిని భూస్థాపితం చేశామని, కాంగ్రెస్ పార్టీకి కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఓడించడం కోసం మాదిగలమంతా ఏకమవుతామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు స్మార్ట్ ప్రకాష్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కపల్లి రాజు, ఎమ్మార్పీఎస్ గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్, శనిగరి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మని మహేష్, ములుగు మండల అధ్యక్షుడు కొక్కొండ నర్సింహులు, కోశాధికారులు బొందిస్వామి, బుర్కి ప్రశాంత్, ఎంఎస్‌పీ జగదేవ్‌పూర్ మండల ఇన్‌చార్జి కర్రోళ్ల మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వం: నర్సారెడ్డి

ములుగు, ఏప్రిల్ 10: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వమని సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. బుధవారం ములుగు మండలం జప్తిసింగాయపల్లికి చెందిన నీలం ప్రభాకర్‌రెడ్డితో పాటు కొంతమంది బీఆర్ఎస్ కార్యకర్తలు గజ్వేల్‌లో నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలకు ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ లాంటి సంక్షేమ పథకాలు పేదలకు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతీ కార్యకర్తకు ప్రభుత్వం అండగా నిలిచి వారికి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మెదక్ ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించుకోవడం కోసం అందరం కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు.



నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

ఆయన వెంట మాజీ ఎంపీటీసీ తమ్మలి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కాంతరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏకాంబరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహ ఆలయ ఈవోపై ఫిర్యాదు



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జంకి, ఏప్రిల్ 10: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయ ఈవో విశ్వనాథశర్మ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి బుధవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆలయ కమిటీని వేయలేదని తెలిపారు. గతంలో కమిటీ రద్దు అయిన నేపథ్యంలో జాతర నిర్వహణ ఎవరి ఆధ్వర్యంలో నిర్వహిస్తారో మండల ప్రజలకు ఆలయ ఈవో తెలియజేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో జాతర నిర్వహణ సన్నాహక సమావేశంలో ప్రజాప్రతినిధులు పాల్గొనకూడదని చెప్పిన ఈవో మండల కేంద్రానికి చెందిన కొందరిని పిలిచి జాతర ఉత్సవ కమిటీపేరుతో అధికార పార్టీకి చెందిన నాయకులతో సమావేశాన్ని నిర్వహించారన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉండాల్సిన ఈవో రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతున్నారన్నారు. ఈవో పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ట్రాక్టర్‌కు గిరాకీ లేదు.. కిస్తులకు డబ్బుల్లేవ్

- నిర్వహణ భారమై తుప్పు పడుతున్న మండల సమాఖ్య ట్రాక్టర్
- రికవరీపై అధికారులు ఉదాసీనం!

మద్దూరు, ఏప్రిల్ 10 : రైతులకు తక్కువ ధరలకే అద్దె ట్రాక్టర్‌ను సమకూర్చి అన్నదాతలకు సేవలందించేందుకు ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్‌కు గిరాకీ లేక తుప్పుపట్టిపోతోంది. వివరాల్లోకి వెళ్తే.. మద్దూరు మండల కేంద్రంలోని జాగృతి సమాఖ్యకు జాతీయ జీవనోపాధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) కింద రూ.2.40 లక్షల గ్రాంట్‌కు మండల జాగృతి సమాఖ్య నిధుల్లోంచి రూ.9.20 లక్షలతో కలిపి మొత్తం రూ.11.60 లక్షలతో రెండేళ్ల క్రితం (జాండీర్ 5310) ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి ఎమ్మెల్యేతో ప్రారంభోత్సవం చేయించారు. కాగా జాగృతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో సుమారు 36 గ్రామైక్య సంఘాలుండగా 924 స్వయం సహాయక మహిళా సంఘాలున్నాయి. మహిళా సంఘాల్లో ఎక్కువ శాతం రైతు కుటుంబాలే ఉండటంతో రైతులకు తక్కువ ధరలకు సేవలందించడం వల్ల కొంతమేరకు ఆదాయం లభించనున్నట్లు ప్రచారం నిర్వహించారు. కిస్తులు చెల్లించలేని పరిస్థితులు నెలకొనడంతో సమాఖ్య ఓ కాంట్రాక్టర్‌కు ట్రాక్టర్‌ను అద్దెకు ఇచ్చారు. కాంట్రాక్టర్ నెలవారి అద్దె సక్రమంగా చెల్లించకపోవడంతో ట్రాక్టర్‌ను తీసుకువచ్చి కార్యాలయం ముందు నిలిపివేయడంతో ప్రస్తుతం తుప్పుపట్టిపోతున్నది. దీంతో మండల సమాఖ్యకు సక్రమంగా కిస్తులు చెల్లించలేని పరిస్థితి ఎదురైంది. మండల సమాఖ్య ద్వారా తీసుకున్న రుణానికి వాయిదాలను సక్రమంగా చెల్లించకుండా పోయింది. ఉన్నతాధికారులు నిధుల రికవరీపై ఉదాసీనంగా ఉన్నట్టు తెలుస్తోంది.



తుప్పుపట్టిపోతున్నమహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్

ప్రజారోగ్యమే ప్రథమ కర్తవ్యం: జిల్లా వైద్యాధికారి



శ్రీగిరిపల్లిలో పీహెచ్‌సీని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్

గజ్వేల్, ఏప్రిల్ 10: ప్రజారోగ్యమే ప్రథమ కర్తవ్యంగా పనిచేస్తామని సిద్దిపేట జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీలో ఆయా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవికాలం దృష్ట్యా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఓఆర్ఎస్ పంపిణీ, ఇతర వైద్యసేవల గూర్చి స్థానిక వైద్యాధికారి రాహుల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ పరిధిలో పలు దఫాలుగా 8000 ఓఆర్ఎస్ పాకెట్లు వచ్చాయని, వాటిని క్షేత్ర స్థాయికి చేర్చామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద, ఉపాధిహామీ పనుల వద్ద, ఆర్టీసీ బస్ స్టాండ్‌ల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట వైద్యాధికారి బల్బీర్‌సింగ్, రాహుల్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఎన్నికలపై రాజకీయ నాయకులకు అవగాహన



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మూర్తి

హుస్నాబాద్, ఏప్రిల్ 10 : హుస్నాబాద్ పట్టణంలోని ఐవోసీ కార్యాలయంలో బుధవారం పార్లమెంట్ ఎన్నికలపై వివిధ రాజకీయ నాయకులు ఆర్డీవో రామ్మూర్తి అవగాహన సమావేశం నిర్వహించారు. పీడబ్ల్యూడీ ఓటర్లు, సీనియర్ సిటిజన్ ఓటర్లు, పోలింగ్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు కావాల్సిన ఫామ్స్‌పై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, బీఆర్ఎస్ నాయకులు చిట్టి గోపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు దొడ్డి శ్రీనివాస్, బీఎస్పీ నాయకులు వేల్పుల రాజు తదితరులున్నారు.

రాంసాగర్‌లో ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం



మల్లేష్ మృతదేహం

రాయపోల్, ఏప్రిల్ 10: మండలంలోని రాంసాగర్ గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్ఐ రఘుపతి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాంసాగర్ గ్రామానికి చెందిన కిచ్చుగారి మల్లేష(40) భార్య స్వరూప ఐదేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నది. ఆయన కూతురు పెళ్లి కాగా కొడుకులిద్దరూ వేర్వేరు గ్రామాల్లో ఉంటున్నారు. దీంతో ఆయన ఒక్కడే గ్రామంలో ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో పండుగ సందర్భంగా మంగళవారం కొడుకు ఇంటికి వచ్చాడు. తండ్రి మద్యం సేవించి ఉండటంతో పక్కవారి ఇంటికి వెళ్లి పడుకున్నాడు. ఉదయం లేచి ఇంటికి వెళ్లే సరికి తలుపులు లోపల గడియ పెట్టి ఉంది. ఎంత పిలిచినా తీయకపోవడంతో కిటికీ నుంచి లోపలికి చూడగా మల్లేష ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. మృతుని కొడుకు కిచ్చుగారి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చేర్యాలలో పేకాడుతున్న పలువురిపై కేసు

చేర్యాల, ఏప్రిల్ 10 : చేర్యాల పట్టణంలోని కేపీఆర్ నగర్ కాలనీలోని ఓ క్లినిక్‌లో పేకాడుతున్న ఐదుగురిని బుధవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని నుంచి రూ.34,890 నగదు, 5 మొబైల్ ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు తథ్యం

చేర్యాల, ఏప్రిల్ 10 : పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు తథ్యమని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జింకల పర్వతాలు దీమా వ్యక్తం చేశారు. బుధవారం చేర్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలలో తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పనితీరుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. భువనగిరి పార్లమెంటు స్థానంలో క్యామ మల్లేశం గెలుపు ఖాయమని, ఉనికి కోసం కాంగ్రెస్ బీజేపీ పాకులాడుతూ జిమ్మిక్కులు చేస్తున్నాయని ఎద్దేవా చేశారు.

ముస్లింలకు రంజాన్ తోఫా



ముస్లింలకు తోఫా పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 10: రంజాన్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని సిద్దిపేట మూడో వార్డు కౌన్సిలర్ వంగ రేణుక తిరుమల్ రెడ్డి ఆకాంక్షించారు. రంజాన్‌ను పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని మూడో వార్డులో ముస్లింలకు రంజాన్ తోఫా (కానుక)లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు నాయకులు దబ్బెట శ్రీనివాస్, పొట్లచెర్వు ఆంజనేయులు, నిమ్మ మహేందర్ రెడ్డి, ఇరేణి మల్లేశం, నరేశ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో చలివేంద్రం ఏర్పాటు

మిరుదొడ్డి, ఏప్రిల్ 10: మండల కేంద్రంలో బుధవారం నైపుణ్య ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఐలయ్య ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భైరయ్య, రమేష్ తదితరులున్నారు.

అలయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 10: సిద్దిపేట అలయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ సోమ వనజ తెలిపారు. బుధవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సిద్దిపేట అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంతవరకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో మరింత విస్తరింపజేయనున్నట్టు తెలిపారు. డిస్ట్రిక్ గవర్నర్‌గా చకిలం బాలచంద్రం, మొదటి గవర్నర్‌గా సోమ శివకుమార్, రెండో గవర్నర్‌గా పెద్ది రామచంద్రం, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్ చరణ్, కోశాధికారిగా కొండ వెంకటేశం, పీఆర్‌వోగా ఆధార సుజాత ఏకగ్రీవంగా ఎంపికైనట్టు తెలిపారు. గురువారం 11గంటలకు సిద్దిపేట వైశ్యభవన్‌లో ప్రమాణ స్వీకారం జరుగుతుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాస్ట్ డిస్టిక్ గవర్నర్ సోమ వనజ